www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

శని వారం
28-1-2023

సంపుటి - 07, సంచిక-243
పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఒత్తడిని అధిగమించి ముందుకు సాగండి

కాపీ కొట్టేవారు ఎప్పటికీ జీవితంలో నెగ్గలేడు

తల్లిదండ్రుల ఆశలు ఎలాగూ ఉంటాయి

పరీక్షా పే చర్చా కార్యక్రమంలో మోడీ



3లో

# రాహుల్ జోడో యాత్రకు సడెన్ బ్రేక్

## భద్రతా కారణాల దృష్ట్యా నిలిపివేత



**శ్రీనగర్, జనవరి 27 (సమ సమాజం):** రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు సడెన్ బ్రేక్ పడింది. జమ్మూ కశ్మీర్ లో కొనసాగుతోన్న ఈ యాత్ర భద్రతా కారణాల దృష్ట్యా శుక్రవారం రద్దయింది. పాదయాత్రలో భాగంగా రాహుల్ బనిహాల్ టన్నెల్ క్రాస్ అవుతుండగా ఆయన్ని చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే జనాన్ని నియంత్రించాల్సిన స్థానిక పోలీసులు అకస్మాతుగా అదృశ్యమయ్యారు. దీంతో జనసముదాయాన్ని నియంత్రించడంలో లోపాలున్నట్లు గుర్తించిన రాహుల్ సెక్యూరిటీ పాదయాత్రను విరమించుకోవాలని సూచించారు. సెక్యూరిటీ సూచనతో రాహుల్ యాత్రను ఆపేసి నైట్ షెల్టర్?కు వెళ్లిపోయారు. దీంతో కశ్మీర్ లోయలో 11 కిలోమీటర్లు సాగాల్సిన రాహుల్ యాత్ర ఒక కిలోమిటర్?కే పరిమితమైంది. పోలీసుల

3లో

## కొనసాగుతున్న డెక్కన్ మాల్ కూల్చివేత పనులు

### జిహెచ్ఎంసి పర్యవేక్షణలో కూల్చివేతలు



**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయిన డెక్కన్ మాల్ కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా పనులు సాగుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగుతున్నాయని జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ జియఉద్దీన్ తెలిపారు. ఇవాళ మీడియాతో ఆయన.. డెమాలిషన్ పనుల కొరకు మొదట్లో ఎస్ కే మల్లు కు టెండర్ ఇచ్చామని..

3లో

# ఒడిషా నేతలను స్వాగతించిన కెసిఆర్

## గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన సిఎం కెసిఆర్




- ఒడిషాలో ఎన్నో నదులు ప్రవహిస్తున్నా తాగునీటికి కటకటలే
- గమాంగ్ తదితరుల చేరిక వెయ్యేనుగుల బలం ఇచ్చింది
- ఒడిషాలో బిఆర్ఎస్‌కు భారీ మద్దతు లభ్యం
- బిఆర్ఎస్‌లో చేరిన ఒడిషా మాజీ సిఎం గిరిజదర్ గమాంగ్
- ఆయనతో పాటు పలువురు మాజీ ఎంపిలు, మంత్రుల చేరిక
- మహాన్ భారత్ నిర్మిద్దామని ప్రజలకు పిలుపు
- రైతులు నాగలి పట్టడమే కాదు..దేశం తలరాత మార్చాలని వినతి



**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** భారతదేశ భవిష్యత్తును మార్చేందుకు, భారతదేశ ఆలోచనను, భావజాలాన్ని మార్చేందుకు ఒక సంకల్పంతో భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భవించిందని సిఎం కెసిఆర్ అన్నారు. ఈ ప్రస్థానంలో, మహా యుద్ధంలో భాగస్వాములయ్యేందుకు ఎంతో దూరమైన ఒడిషా నుంచి వచ్చిన సోదర, సోదరీమణులకు స్వాగతం పలుకుతున్నాను. మీ అందరినీ అభినందిస్తున్నాని గమాంగ్ తదితరుల చేరిక సందర్భంగా కెసిఆర్ అన్నారు. ఒడిషా మాజీ ముఖ్యమంత్రి, అగ్రనేత, రాజకీయ భీష్మాచార్యుడు గిరిదర్ గమాంగ్ , శ్రీమతి హేమ గమాంగ్ ,కుమారులు శిశిర్ గమాంగ్ తదితర నాయకులందరినీ స్వాగతిస్తూ, అభినందిస్తున్నానని అన్నారు. అక్షయ్ కుమార్ గాంధీజీ బాటలో నడుస్తున్న గొప్ప వ్యక్తి, ఉద్యమకారుడు. రైతుల కోసం ఉద్యమాలు చేపట్టిన వీరి వెన్నంటి నడుస్తున్న ఎంతోమంది నేడు బిఆర్ఎస్ లో చేరుతున్నారు. మీ అందరికీ పేరు పేరునా స్వాగతం పలుకుతున్నాను . మనం 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నాం. 75 సంవత్సరాలు అనేది సుదీర్ఘ కాలం. ఈ కాలంలో రెండు తరాలు జీవితాలు సంపూర్ణమై, మూడవ తరం జీవితాలు సాగుతున్నాయి. మనకంటే ముందు, మన తర్వాత ఎన్నో దేశాలు స్వాతంత్ర్యాన్ని పొందాయి. వీటిని బేరీజు వేసుకుంటే మన దేశ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఒడిషా లోని మహానదిలో మన అవసరాలకు మించి నీటి లభ్యత ఉంది. కానీ మనం 25-30 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నాం. మిగతా నీరు

3లో




## లిక్కర్ కేసులో శరత్‌చంద్రారెడ్డికి ఊరట

### మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**న్యూఢిల్లీ, జనవరి 27 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ పాలసీ ఈడీ కేసులో శరత్ చంద్రారెడ్డికి బెయిల్ మంజూరైంది. రౌస్ అవెన్యూ కోర్టు 14 రోజుల మధ్యంతర

3లో

## దొడ్డిదారిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు

3లో

- సచివాలయం వేదికగా బదిలీల ప్రక్రియ
- ఆందోళనకు దిగిన ఉపాధ్యాయ సంఘాలు
- స్పౌజ్ క్యాటగిరీ బదిలీలపై అనుమతికి డిమాండ్

## తెలుగు చలనచిత్రరంగంలో మరో విషాదం

- అలనాటి మేటినటి జమున కన్నుమూత
- సత్యభామ పాత్రలో ఇమిడిపోయిన జమున
- అనేక చిత్రాల్లో వైవిధ్యమున్న పాత్రలకు జీవం



**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** తెలుగుచలనచిత్ర రంగం మరో ధృవతారను కోల్పోయింది. అలనాటి మేటినటి, తెలుగింటి సత్యభామగా గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటి జమున (86) కన్నుమూశారు. ఇటీవల వరుస విషాదాలు చిత్రరంగాన్ని చుట్టుముట్టాయి. కృష్ణంరాజు, కృష్ణ, సత్యనారాయణల తరవాత ఇప్పుడు జమున కూడా కన్నుమూశారు. గతకొంతకాలంగా వయోసంబంధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న జమున.. హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిపట్ల పలువురు సినీ రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. జమున.. 1936 ఆగస్ట్ 30న నిప్పని శ్రీనివాసరావు, కౌసల్యాదేవి దంపతులకు కర్నాటకలోని హంపీలో జన్మించారు. సినిమాల్లోకి రాకముందు ఆమెపేరు జానాబాయి. అయితే జ్యోతిషుల సూచనతో ఆమె పేరును జమునగా మార్చారు. తండ్రి వ్యాపార రీత్యా.. ఆమె బాల్యమంతా గుంటూరు జిల్లా దుగ్గిరాలలో గడిచింది. తల్లి దగ్గరే సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. నటుడు జగ్గయ్య.. ఖిల్జీరాజు పతనం అనే

3లో

## డబ్బింగ్ ఆర్టిస్ట్ శ్రీనివాస మూర్తి కన్నుమూత

**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ శ్రీనివాస మూర్తి కన్నుమూశారు. చెన్నైలో ఇవాళ ఆయన గుండెపోటుతో మరణించారు. శ్రీనివాస మూర్తి తమిళ, తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులు. డబ్బింగ్ రంగంలో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఆయన తెలుగులో సూర్య, అజిత్, మోహన్ లాల్, రాజశేఖర్, విక్రమ్ ఇలా ఎంతో మంది స్టార్ హీరోల పాత్రలకు తెలుగులో డబ్బింగ్ చెప్పారు. ఈయన ఎన్నో సినిమాల్లో చేసినప్పటికీ పెద్దగా ప్రాచుర్యంలోకి రాలేదు. ఒ మీడియా ఛానెల్ చేసిన ఎక్స్ క్లూజివ్ ఇంటర్వ్యూతో శ్రీనివాస మూర్తి గురించి తెలుగు ప్రేక్షకులకు తెలిసింది. ఆయన మృతి పట్ల పలువురు సినీ తారలు సంతాపం వ్యక్తం చేశారు



## లోకేశ్ పాదయాత్ర ప్రారంభంలోనే అపశృతి

- స్వల్ప గుండె నొప్పితో కుప్పకూలిన నటుడు తారకరత్న
- ఆస్పత్రికి తరలించి చికిత్స..నిలకడగా ఆరోగ్యం



**చిత్తూరు, జనవరి 27 (సమ సమాజం):** లోకేశ్ పాదయాత్ర ప్రారంభంలోనే అపశృతి చోటు చేసుకుంది. లోకేశ్ పాదయత్ర ప్రారంభంలో పాల్గొన్న నటుడు నందమూరి తారకరత్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శుక్రవారం కుప్పం నియోజకవర్గం కేంద్రం నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రారంభించిన పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న తీవ్ర అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోవడంతో చికిత్స కోసం హుటాహుటినా కుప్పం ఆస్పత్రికి తరలించారు. కుప్పంలో ఉన్న ఎమ్మెల్యే బాలకృష్ణ విషయం తెలుసుకుని ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న తారకరత్నను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి

3లో

## సంపాదకీయం

# పార్లమెంట్ వేదికగా నిలదీయాల్సిందే !

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగబోతున్న తరుణంలో తెలుగు రాష్ట్రాల ఎంపిలు తమ రాష్ట్రాల సమస్యలపై గళం విప్పాల్సి ఉంది.ఇంతకాల ఏదో ఒక విధంగా తప్పించుకుంటున్న తీరు ఇప్పుడు ఇక చెల్లబోదు. ఎన్నికల సీజన్‌లో ప్రజల ముందుకు వెళ్లబోతున్న తరుణంలో పార్లమెంటులో సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉంది. ఇంతకాలం మొహం చాటేసినా చెల్లింది. ఇక చెల్లదన్న విషయం పాలక, విపక్ష పార్టీలు గుర్తించాలి. బిజెపి కూడా ఇంకెంతోకాలం మభ్యపుచ్చే మాటలతో ప్రజలను మోసగించలేదు. విశాఖ ఉక్కు, బయ్యారం ఉక్కు, కడప ఉక్కులపై నిర్మొహమాటంగా తేల్చాలి. కృష్ణా జలాలలపైనా పంచాయితీ తేల్చాలి. గత ఎనిమిదన్నరేళ్లుగా అనేక సమస్యలు ఉన్నా వాటిని చర్చించడం లేదు. విభజన పక్రియ ఇరు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు పుట్టించింది. ఇది ఎవరూ కాదనలేని నిజం. ఇప్పటికీ నష్టం చేస్తున్నదని..ఎపి ప్రజలు వాపోతున్నదీ కూడా నిజమే. సానుభూతికన్నా సమస్యల పరిష్కారం ముఖ్యమన్న ధోరణిలో ప్రజలు ఉన్నారు. విభజన తరవాత ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు మానసికంగా స్థిరపడి పోయారు. ఎవరికి వారు బతుకుతున్నారు. ఈ స్థితిలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేలా కాకుండా ప్రధాని మోడీ సమస్యలను పరిష్కరించే పెద్దరికం తీసుకోవాలి. ఏ ప నిచేసినా అది ఈ దేశ భవిష్యత్ కోసమే అని గుర్తించాలి. కేంద్రం విభజన హామీలను నెరవేర్చడం లేదన్న ఆగ్రహంతో ఉన్న ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. తెలంగాణలో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరంతరం ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఎపిలో అధికార వైసిపి పట్టించుకోక పోయినా విపక్షాలు సమస్యలపై నిలదీస్తున్నారు.మోడీ తీరుపై తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు మోడీపై విమర్శల దాడికి పూనుకున్నాయి. తిరుపతి పుణ్యక్షేత్రంలో మోడీ ఎన్నికల ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని ప్రమాణం చేసినా నెరవేర్చ లేదు. సరికాదా రకరకాల విన్యాసాలు చేశారు. కడప ఉక్కు సంగతి పక్కన పెడితే ఉన్న విశాఖ ఉక్కును తుక్కుగా అమ్మడానికి సిద్ధం అయ్యారు. ఇది నిజంగానే ప్రజలకు ఆగ్రహం తెప్పించే విషయం. ఉద్యమం ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం ప్రజల సెంటిమెంట్‌ను దెబ్బకొట్టడమే. అమరావతి ఉద్యమం సాగుతున్న వేళ వారికి కనీస స్వాంతన చేకూర్చే ప్రయత్నం చేయలేదు. మోదీ ఆదానీ,అంబానీ లాంటి వారికి మాత్రమే అండగా ఉంటున్నారన్న భావన ప్రజల్లో బాగా బలపడిపోయింది. పేదలను నిరుపేదలుగా మార్చేస్తున్నారన్న విమర్శలకు మీడియా ద్వారా బాగా ప్రాచుర్యం వస్తోంది. పలు ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టడం, వాటిని సక్రమంగా నిర్వహించలేక చేతులెత్తేయడం..నీరవ్ మోడీ, విజయ్ మాల్యా లాంటి వారిని దేశం దాటించడం వంటి వాటిపైనా ప్రజలకు అనుమానాలు ఉన్నాయి. ఇవన్నీ మోడీ నేతృత్వంలో జరిగినవే అన్న భావనా ఉంది. రాష్ట్ర విభజన పక్రియపై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ వచ్చిన మోడీ..సమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ పరువుతీయాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నరే తప్ప తెలుగు రాష్ట్రాల సమస్య లు మాత్రం పరిష్కారం కావడం లేదు. రాష్ట్ర విభజనను కాంగ్రెస్ ప్రజాస్వామిక పద్దతిలో చేయలేదన్న భావన ఉంటే.. సమస్యలను ఏ విధంగా పరిష్కరించారో..చెప్పుకునేందుకు మోడీకి, బిజెపికి కూడా ఏమీ లేదు. ఎందుకంటే ఎపికి ఒక్కటంటే ఒక్క ప్రయోజనం కూడా చేకూరలేదు. చర్చకు తావులేకుండా అహం కారంతో నాటి కాంగ్రెస్ వ్యవహరించిందని మోదీ వాదనగా ఉంది. అయితే అనేక బిల్లులను మోడీ కూడా అలాగే చేశారు. పెరుగుతన్న నిత్యావసర ధరలు, పెట్రలో ధరలు, గ్యాస్ ధరలు, ఇంటి నిర్మాణ ధరలు.. జిఎస్టీ వాతలు వంటి వాటి ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నాయో అనుభవిస్తున్న ప్రజలకు మాత్రమే తెలుసు.

పార్లమెంట్ సమావేశాల్లో వాటిగురించి ప్రస్తావించకుండా ఉండేందుకు బిజెపి ముఖ్యంగా మోడీ ఎన్నో ఎత్తుగడలు వేస్తున్నారన్న భావన ప్రజల్లో ప్రబలుతోంది. నిజానికి మోడీ వచ్చాక ఓ బృహత్తర భారతం ఆవిష్కృతం అవుతుందని అంతా భావించారు. ప్రధానంగా సామాన్యులు చాలా ఆశ పడ్డారు. కానీ జరిగింది అందుకు పూర్తి భిన్నంగా ఉంది. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్టీ వరకు తీసుకున్న నిర్ణయాలు ప్రజల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడుతున్నా.. మోడీ ఏనాడూ దానిపై చర్చించడంలేదు. వ్యవసాయ చట్టం పట్ల రైతులు ఎంతగా వ్యతిరేకించారో అర్థం చేసుకోవాలి. అలాంటి పోరాటాలు చేస్తే తప్ప మోడీ దిగిరాడని ఉమ్మడి ఎపి ప్రజలు కూడా గుర్తించాలి. తమ స్వార్థ రాజకీయాల ను పక్కన పెట్టి పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి. రాష్ట్ర బిజెపి నేతలు కూడా విమర్శలు, ఎదురుదాడి విధానాలు, అధికారమే లక్ష్యంగా పనిచేసే పద్దతిని వీడాలి. విభజన సమస్యలపై

పార్టీలో అంతర్గతంగా చర్చజరగడం లేదు. అయినా ఈ దేశాన్ని ఉద్ధరించే మహానుభావుడన్న రీతిలో మోడీని సోషల్ మీడియా వేదికగా పొగడ్తలతో ముంచెత్తే ప్రచారంలో బిజెపి నేతలు పోటీపడుతున్నారు. దేశంలో అనేక భయాలు వెన్నాడుతున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు మోడీ ప్రభుత్వం భరోసాగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులుకుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫల మయ్యారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే కాలం గడుపుతున్నారు. కనీసం ఈ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అయినా దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై సమగ్ర చర్చకు పట్టుబట్టాలి. అందుకు అనుగుణంగా వాతావరణం సృష్టించుకోవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# కెసిఆర్ అడుగులతో చలనం వచ్చేనా ?

**ప్రత్యమ్నాయ రాజకీయాలపై సర్వత్రా చర్చ ● రాజకీయ పార్టీల్లో కానరాని కదలిక**

**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** బిజెపిపై అమీతుమీకి సిద్ధమయిన బిఆర్‌ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ ప్రత్యామ్నాయ రాజకీయాలకు కేంద్ర బిందువు అవుతారా అన్న చర్చసాగుతోంది. కేంద్రానికి వ్యతిరేకంగా విమర్శల దాడిని పెంచిన సిఎం కెసిఆర్..ఇటీవల ప్రధాని మోడీ పర్యటనలను బహిష్కరించారు. కనీసం ఆయనకు స్వాగతం పలికేందుకు కూడా వెళ్లలేదు. గవర్నర్ వ్యవస్థను వ్యతిరేకిస్తున్నారు. తమిళసై తీరుతో ఆగ్రహంగా ఉన్న కెసిఆర్ ఆమెతో అమీతుమీ అన్నట్లుగా ఉన్నారు. గణతంత్ర వేడుకల్లో ఇది మరింత స్పష్టం అయ్యింది. ఫిబ్రవరి 17న సచివాలయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఇర్ణయించారు. ఈసారి మరో ఇద్దరు సిఎంలను ఆహ్వానిస్తున్నారు. గతంలో ఎన్టీఆర్ చేసిన కృషిలాగా కెసిఆర్ గట్టిగా అడుగులు వేయడం లేదు. విపక్షాలను ఏకతాటిపైకి తీసుకుని రాలేకపోతున్నారు. గతంలో పార్టీలు, నేతల మధ్య వైరుధ్యాలు ఉన్నా ఎన్టీఆర్ అందరినీ ఒకే దారిలోకి తేగలిగారు. అలా తెస్తే తప్ప మోడీకి ప్రత్యమ్నాయం సాధ్యం కాదు. అలా చేస్తేనే కనీసం మోడీని ఎదరించగలిగే వేదిక సాధ్యం కాగలదు. ఈ క్రమంలో దేశంలో ప్రత్యమ్నాయా రాజకీయాలు, దేశ అవసరాలు, పరిష్కారాలను ప్రజల ముందుంచి చర్చ చేస్తున్నారు. బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగట్టేందుకు రంగం సిద్ధం చేసారు. అలాగే విపక్షాలు కూడా మోడీ తీరుపై మండిపడుతున్నాయి. ఈ క్రమంలో కెసిఆర్ రాజకీయ పునరేకీకరణకు పూనుకుంటారా అందుకు.. సిద్దంగా ఉన్నారా అన్న చర్చ జరుగుతోంది. మోడీ తీరుతో దేశంలో ఆశావహ రాజకీయాలకు అవకాశం ఏర్పడింది. అయితే దానిని పూడ్చే క్రమంలో ఎవరికి వారు పోరాడుతున్నారు. కలసి పోరాడాలన్న సంకల్పం ఉన్నా ఎవరు కూడా పెద్దగా ముందుకు రావడం లేదు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంపై వరుసగా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. విరుచుకుపడ్డారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరింత బలంగా పోరాడతానని ప్రకటించారు. పనిలో పనిగా ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసి కొత్త రాజ్యాంగాన్ని తీసుకురావలసిన అవసరం ఉందని గతంలో ప్రకటించారు. జాతీయ స్థాయిలో ప్రత్యమ్నాయం కోరుకునే ఇతర నాయకులు మాత్రం సీరియస్‌గా తీసుకోవడం లేదు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడైన తర్వాత కాంగ్రెస్ పుంజుకుందన్న అభిప్రాయం వ్యాపించింది. దీంతో భారతీయ జనతా పార్టీని కేసీఆర్ మళ్లీ టార్గెట్‌గా ఎంచుకున్నట్టు అనిపిస్తోంది. తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. ఉత్తరాదిన తిరుగులేని పరిస్థితి ఉన్నా.. దక్షిణాదిలో వారికి పట్టుచిక్కడం లేదు. ఇంతకుముందు దక్షిణాదిన మొదటిసారిగా కర్ణాటకలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు మళ్లీ తమ హయాంలో తెలంగాణలోనైనా అధికారంలోకి రావాలని మోదీ ద్వయం సంకల్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళలో బీజేపీకి ఏ మాత్రం అవకాశం లేదు. ఇక మిగిలింది తెలంగాణనే కనుక ఈ రాష్ట్రంపై వారి దృష్టిపడింది. తెలంగాణను చేజిక్కించుకోవడం కోసం ఎంతదూరం వెళ్లడానికైనా వారిరువురూ సిద్ధంగా ఉన్నారు. అయితే పరిస్థితులు అనుకూలిస్తున్న వేళ తెలంగాణపై ప్రధాని మోడీ ప్రత్యే దృష్టి సారించింది. అయితే కెసిఆర్ నియంతృత్వ పోకడల విషయంలో ప్రజలు కూడా అసహనంగానే ఉన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇంచుమించుగా నియంతులు గానే రాజ్యం ఏలుతున్నారు. ఏ మంత్రి కూడా కేసీఆర్, జగన్‌ల ముందస్తు అనుమతి లేకుండా తమ శాఖకు సంబంధించిన విషయంలో కూడా నిర్ణయం తీసుకునే ధైర్యం చేయడం లేదు. ప్రాంతీయ పార్టీలు ఆవిర్భవించిన తర్వాత ఏక వ్యక్తి పాలన మొదలైంది. అది ఇప్పుడు కేసీఆర్, జగన్ రూపంలో పరాకాష్ఠకు చేరింది. ప్రజాస్వామ్యంలో ప్రజలదే సర్వాధికారం అనే మౌలిక సూత్రాన్ని విస్మరించి ప్రజలు ఇచ్చిన అధికారంతో నేతలు సర్వభోగాలు అనుభవిస్తున్నారు. మొత్తంగా కేంద్రంలో గుణాత్మక రాజకీయాలతో ముందుకు సాగితే ప్రజలు కూడా స్వాగతించవచ్చు.

# రాములమ్మ 25 ఏళ్ల పోరాటంపై పుస్తకావిష్కరణలో బండి



**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** రాష్ట్రంలో కుటుంబపాలన అంతం కోసం విజయశాంతి పోరాడుతు న్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆమె పోరాటం స్ఫూర్తిదాయకమని చెప్పారు. విజయశాంతి 25ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై రచించిన మన రాములమ్మ రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. పార్లమెంట్?లో తెలంగాణ కోసం కొట్లాడింది విజయశాంతి మాత్రమే అని వ్యాఖ్యానించారు. బీజేపీలో మాత్రమే ప్రజాస్వామ్యం ఉందని.. కుటుంబ పార్టీలో ఉండదని విమర్శించారు. ఎంతోమంది కార్యకర్తల త్యాగాలతో బీజేపీ నిర్మాణమైందన్నారు. సిద్దాంతం కోసం పనిచేసే పార్టీ బీజేపీ అని.. పార్టీని వదిలివెళ్లిన నాయకులు తిరిగిరావాలని పిలుపునిచ్చారు. ఏ ఆశయాల కోసం తెలంగాణ సాధించుకున్నామో వాటిని సాధించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఒక విష సర్పం అని.. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని బీజేపీ నేత విజయశాంతి సూచించారు. రాష్ట్రం రాంగ్ పర్సన్ చేతుల్లోకి వెళ్లిందని విజయశాంతి అన్నారు. కేసీఆర్‌కు మరోసారి అధికారమిస్తే రాష్ట్రంలో ప్రజలు బతకలేని పరిస్థితులు వస్తాయన్నారు. విజయశాంతి రాజకీయాల్లోకి వచ్చి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా మన రాములమ్మ రాజకీయ ప్రస్థానం పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఇంచార్జ్ తరుణ్ చుగ్, బండి సంజయ్, కిషన్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి సహా పలువురు పాల్గొన్నారు. కేసీఆర్‌కు అభద్రతాభావం ఎక్కువైందని విజయశాంతి అన్నారు. తాను కనబడొద్దని కేసీఆర్ అనుకున్నారని.. అందుకే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన రోజే తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు. అంతేకాకుండా ఎన్నికల్లో తనను ఓడగొట్టేందుకు కేసీఆర్ ప్రయత్నించారన్నారు. ఎన్ని బాధలు పడ్డా మనసులోనే దాచుకున్నట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. బీజేపీ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విజయశాంతి డైనమిక్ లీడర్ అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి కొనియాడారు. ఆమె మాట ఇస్తే తప్పే మనిషి కాదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ కోసం తమతో కలిసి విజయశాంతి పోరాడిందని గుర్తుచేసుకున్నారు. బీజేపీ బలోపేతం కృషి చేస్తోన్న విజయశాంతి రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆయన అకాక్షించారు. 1998 జనవరి 26న రాజకీయాల్లోకి వచ్చిన విజయశాంతి మొదట్లో బీజేపీలో చేరారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడంతో బీజేపీ నుంచి తప్పుకుని 2005లో తల్లి తెలంగాణ పార్టీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నాలుగేళ్లకు తన పార్టీని టీఆర్‌ఎస్ లో కలిపేశారు. 2009 ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి, గెలిచి ఎంపీ అయ్యారు. కొన్ని ప్రతికూల పరిణామాలతో ఆమె టీఆర్‌ఎస్ పార్టీకి దూరమయ్యారు. 2014లో కాంగ్రెస్ లో చేరిన విజయశాంతి... అక్కడా ఇమడలేకపోయారు. 2020లో విజయశాంతి మళ్లీ బీజేపీ గూటికే చేరారు.

## రాజకీయాల్లో 25 ఏళ్ల ప్రస్థానం

### గన్‌పార్క్ వద్ద నివాళి అర్పించిన విజయశాంతి



**హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం):** రాజకీయాల్లోకి వచ్చి 25 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా నాంపల్లి గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద బీజేపీ నాయకురాలు విజయశాంతి నివాళులర్పించారు. ప్రముఖ సినీ నటి, మాజీ ఎంపీ విజయశాంతి రాజకీయాల్లోకి ప్రవేశించి 25 సంవత్సరాలు పూర్తయ్యాయి. 1998 జనవరి 26న రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. మొదట్లో బీజేపీలో చేరారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఊపందుకోవడంతో బీజేపీ నుంచి తప్పుకుని 2005లో తల్లి తెలంగాణ పార్టీ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నాలుగేళ్లకు తన పార్టీని టీఆర్‌ఎస్‌లో కలిపేశారు. 2009 ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానం నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి, గెలిచి ఎంపీ అయ్యారు. కొన్ని ప్రతికూల పరిణామాలతో ఆమె టీఆర్‌ఎస్ పార్టీకి దూరమయ్యారు. 2014లో కాంగ్రెస్‌లో చేరిన విజయశాంతి... అక్కడా ఇమడలేకపోయారు. 2020లో విజయశాంతి మళ్లీ బీజేపీ గూటికే చేరారు

# నిజామాబాద్‌లో నేడు కెటిఆర్ పర్యటన

## కళాభారతికి శంకుస్థాపనకు సర్వం సిద్ధం



**నిజామాబాద్, జనవరి 27 (సమ సమాజం):** ముఖ్యమంత్రి కెటిఆర్ శనివారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించ నున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 28వ తేదీన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా కళాభారతికిశంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే కూల్చేసిన పాత కలెక్టరేట్ భవన సమీపంలోనే ఉదయం 11గంటలకు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో కళాభారతి ఆడిటోరియం నిర్మించనున్నది. కళాభారతి డిజైన్‌ను ఖరారు చేసింది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో విభిన్న రకాల నమూనాలను రూపొందించగా తుది డిజైన్‌కు సీఎం ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి వివరాలను వెల్లడించారు. భారీ నిర్మాణ శైలిలో కళాభారతి అత్యద్భుతంగా కనిపించేలా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం రూ.50కోట్ల నిధులను వెచ్చించనున్నారు. సెప్టెంబర్ 5న నిజామాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రారంభోత్సవానికి కెసిఆర్ వచ్చారు. ఈ సందర్భంగా ఎల్లమ్మగుట్ట పార్టీ కార్యాలయం నుంచి రోడ్డు మార్గంలో వెళ్తున్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పాత కలెక్టరేట్ పక్కనుంచే కాన్వాయ్ వెళ్తుండగా సీఎం పక్కనే ఉన్న జిల్లా ప్రజాప్రతినిధులు పాత కలెక్టరేట్ ఇదేనంటూ వివరించారు. ఈ స్థలంలో భారీ ఆడిటోరియం నిర్మించాలంటూ కేసీఆర్ ఆలోచన చేశారు. తదనంతరం నిజామాబాద్ నగర అభివృద్ధిపై కొద్ది రోజుల క్రితం జరిగిన సమీక్షలోనూ ఈ అంశంపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. కళాభారతి నిర్మాణానికి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని చెప్పడంతో వెనువెంటనే యంత్రాంగం పాత కలెక్టరేట్ భవనాలను పూర్తిగా నేలమట్టం చేసి చదును చేసింది. ఇప్పుడీ ప్రాంతంలోనే కనీవినీ ఎరుగని రీతిలో భారీ ఆడిటోరియం నిర్మాణం కానున్నది. ఇందుకు సంబంధించిన పూర్తి బాధ్యతలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి సీఎం అప్పగించారు. ఇందుకోసం రూ.50కోట్లు వెచ్చించబోతున్నారు. ఇందూరు కళాభారతి భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రానున్నారు. శనివారం ఉదయం 11గంటల ప్రాంతంలో కేటీఆర్ చేతుల మీదుగా లాంఛనంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంతోపాటు మరిన్ని నగరాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# బిఆర్ఎస్ బలోపేతంతో బిజెపికి చెమటలు: జీవన్ రెడ్డి



**నిజామాబాద్, జనవరి 27 (సమ సమాజం):** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బిఆర్‌ఎస్ బలోపేతం లక్ష్యంగా పనిచేస్తామని టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి అన్నారు. రానున్న కాలంలో బిజెపికి స్థానం లేకుండా చేస్తామని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం చేస్తున్న కృషికి అనుగుణంగా ముందుకు సాగి పార్టీని ప్రజల్లోకి తీసుకుని వెళతామన్నారు.రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని దూకుడుగా పనిచేస్తామని అన్నారు. బిజెపి ఎంపి ధర్మపురి అర్వింద్ వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదన్నారు. అలాగే పసుపుబోర్డు పేరుతో గెలిచిన అర్వింద్ రైతులను మోసం చేశారని అన్నారు. దేశ ప్రజల ఆకాంక్ష మేరకే సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేశారని, పార్టీ ప్రారంభించిన అనతికాలంలోనే దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నదని ఎమ్మెల్యే అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతగాని తనం వల్లే దేశంలో చీకట్లు అలుముకున్నాయని, ఆ చీకట్లను తొలగించి వెలుగులు ప్రసరింపజేసే సత్తా సీఎం కేసీఆర్‌కే సాధ్యమని పేర్కొన్నారు.

# తుమ్మలపల్లి గ్రామ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని శాలువాతో సత్కరించిన మండల ఉపాధ్యాక్షుడు కురుపాటి సుదర్శన్



**చండూరు, జనవరి 27 (సమ సమాజం):** నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామ అభివృద్ధికి యాబై లక్షల రూ.ల నిధులను మంజూరు చేసిన శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి శుక్ర వారం శంకుస్థాపన చేయటానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల శంకు స్థాపనలు చేశారు. అనంతరం శాసన సభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తుమ్మలపల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాను అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చండూరు మండల ఉపాధ్యక్షుడు కురుపాటి సుదర్శన్‌తో పాటు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎంపిపి పల్లె కళ్యాణి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, కోడి వెంకన్న, వైఎస్ ఎంపిపి మందాడి నరసింహారెడ్డి, ఎంపీటీసీ పల్లె వెంకన్న, గ్రామ సర్పంచ్ కురుపాటి రాములమ్మ, ప్రభుత్వ అధికారులతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, బొడ్డు సతీష్, లాయర్ల జేఏసీ రాష్ట్ర నాయకులు నారపాక సురేందర్,



మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇరిగి గురునాథం, యూత్ జిల్లా లీడర్ కురుపాటి సైదులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కురుపాటి లక్ష్మణ్, ఉప సర్పంచ్ బోయపల్లి రాజు గౌడ్, కురుపాటి వెంకటేశ్వర్లు, కాశిమళ్ళ అనీల్, ముక్కం రాజు గౌడ్, దాసరి వెంకటయ్య కురుపాటి జగాల్, అద్దంకి కిరణ్, దాసరి నగేష్, కురుపాటి బిక్షం, కాశిమళ్ళ యాదయ్య, తీగల వెంకటేశ్వర్లు, కురుపాటి శ్రవన్, ఇర్గదిండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం

### ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండుశాతం రిజర్వేషన్

### క్రీడా, పర్యాటక శాఖల మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్‌నగర్, జనవరి 27 (సమ సమాజం):** క్రీడల్లో రాణించే క్రీడాకారులకు రెండు శాతం ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా, పర్యాటక శాఖలమంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న విషపూరిత ప్రచారానికి యువత ఆకర్షితులు కాకుండా సరైన మార్గంలో నడవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు ప్రాధ్యానమిస్తుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాస్టేడియం మైదానంలో తన తల్లితండ్రులు విరసనోళ్ల నారాయణ గౌడ్, శాంతమ్మ పేరుతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తుందేందుకు గ్రామీణాస్థాయిలో క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తున్నాని వెల్లడించారు. జాతీయ అంతర్జాతీయ వేదికలపై పథకాలు సాధించే క్రీడాకారులకు నగదు పురస్కారాలను అందిస్తున్నామని ఆయన వివరించారు. క్రమశిక్షణ తో తమ జీవితాల్ని చక్కదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో మెగా జాబ్‌మేళాను నిర్వహించి సుమారు 4500 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలను కల్పించామన్నారు. త్వరలో మరో జాబ్ మేళా నిర్వహించి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా చైర్మన్ గంజి వెంకన్న ముదిరాజ్, కౌన్సిలర్లు కిషోర్, నిర్వాహకులు నరేశ్, రాజేశ్ ,పవన్, రాజేందర్, గిరి, వీరేశ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ జోడో యాత్రకు సడెన్ బ్రేక్



(మొదటి పేజీ తరువాయి) తీరుపై కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా మండిపడగా.. రాహుల్ సైతం అసహనం వ్యక్తం చేశారు. 'బనిహాల్ టన్నెల్ దాటిన తర్వాత పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారిని వెళ్లిపొమ్మని ఎవరు ఆదేశాలు జారీ చేశారు. ఈ లోపానికి బాధ్యులైన అధికారులు సమాధానం చెప్పాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ అన్నారు. భారత్ జోడో యాత్రకు భద్రత కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ జమ్మూ కశ్మీర్ ఇంచార్జ్ రజినీ పాటిల్ విమర్శించారు. రాహుల్ గాంధీ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అంతకుముందు ఈ యాత్రలో నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా పాల్గొన్నారు. భారత్ జోడో యాత్ర లక్ష్యం రాహుల్ ఇమేజ్ పెంచుకోవడం కోసం కాదని.. దేశంలోని పరిస్థితిని మార్చడానికని ఒమర్ అబ్దుల్లా చెప్పారు. అందుకే ఈ యాత్రలో పాల్గొన్నట్లు స్పష్టం చేశారు.

# లిక్కర్ కేసులో శరత్‌చంద్రారెడ్డికి ఊరట



(మొదటి పేజీ తరువాయి) బెయిల్ మంజూరు చేసింది. రూ.2 లక్షల పూచికత్తుపై జస్టిస్ నాగ్ పాల్ ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. తమ నానమ్మ అంత్యక్రియలు, కర్మకాండలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బెయిల్ మంజూరు చేసింది. ఈనెల 25న సాయంత్రం శరత్ చంద్రారెడ్డి నానమ్మ చనిపోయారు. శరత్ చంద్రారెడ్డి నానమ్మ అంత్యక్రియలు, కర్మకాండలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రెండు వారాల బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది పిటిషన్ వేశారు. శరత్ తండ్రి విదేశాల్లో ఉండడంతో నానమ్మ దగ్గరే శరత్ పెరిగాడని, ఆమె చివరి కోరిక మేరకు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు శరత్ చంద్రారెడ్డికి అనుమతి ఇస్తూ బెయిల్ ఇవ్వాలని కోరారు. విచారణ చేపట్టిన రౌస్ అవెన్యూ కోర్టు.. శరత్ చంద్రారెడ్డికి 14 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

# దొడ్డిదారిన టీచర్ల బదిలీలు, ప్రమోషను



(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్, జనవరి 27 (సమ సమాజం): ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో పారదర్శకంగా బదిలీలు చేస్తామని చెప్పిన రాష్ట్ర విద్యాశాఖ పారదర్శకతకు పాతరేసి పైరవీ బదిలీలకు తెరతీస్తే ఎలా అని ఉపాధ్యాయులు ప్రశ్నించారు. ఇప్పటి వరకు సెక్రెటరియేట్ వేదికగా 140 అక్రమ బదిలీలు జరిగాయని అన్నారు. పైరవీ బదిలీలు ఆపాకపోతే జిల్లా వ్యాప్తంగా అన్యాయానికి గురైన ఉపాధ్యాయులందరం ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సెక్రెటరియేట్ వేదికగా రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు,అక్రమ ప్రమోషన్స్ నిలిపివేయాలని ఉపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. ఎల్బీ నగర్ లోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్స్ ధర్నాకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం అక్రమ బదిలీలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన టీచర్స్.. అక్రమ బదిలీలకు ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. సాధారణ బదిలీలకు ముందు ఇలా చెయ్యడం అన్యాయమని.. దొడ్డి దారి బదిలీలను ఖండించారు. ఈ విధమైన బదిలీలు చేయడం ద్వారా ఎన్నో ఏండ్లుగా సాధారణ బదిలీల కొరకు ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు తీరని నష్టం, అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు. వెంటనే ఈ దొడ్డిదారి అక్రమ బదిలీలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీ నగర్ లోని జిల్లా పరిషత్ స్కూల్ లో ప్రమోషన్స్ కోసం సర్టిఫికేషన్స్ వేరిపికేషన్స్ జరుగుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్ పారదర్శకంగా జరపాలని డిమాండ్ చేశారు.

# ఒత్తడిని అధిగమించి ముందుకు సాగండి




(మొదటిపేజీతరువాయి) న్యూఢిల్లీ, జనవరి 27 (సమ సమాజం): క్రికెట్‌లో బ్యాట్స్‌మెన్‌లో తమ దృష్టి బాల్‌ను ఎదుర్కోవడంపైనే సారించాలని ప్రదాని మోడీ విద్యార్థులకు సూచించారు. స్టేడియంలో ప్రేక్షకులు ఫోర్లు, సిక్సర్లు బాదాలని ఆశిస్తారని, కానీ బ్యాట్స్‌మెన్ తను ఎదుర్కోబోయే బాల్ గురించి మాత్రమే ఆలోచిస్తాడని అన్నారు. 'పరీక్షా పే చర్చ' తనకు కూడా పరీక్షేనని.. కోట్లాది మంది విద్యార్థులు తన పరీక్షకు హాజరవుతున్నారని ప్రధాని మోడీ అన్నారు. పరీక్షా పే చర్చ 2023 కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ తల్కతోరా స్టేడియంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి ఆశించడం సహజమే.. కానీ స్టేటస్ కోసం వారిని ఒత్తడి చేయొద్దని సూచించారు. రాజకీయాల్లో తమక్కూడా ఒత్తిడి ఉంటుందని, కానీ ఆ ఒత్తిడితో మీ సామర్థ్యాలను తక్కువ అంచనా వేయొద్దని విద్యార్థులకు చెప్పారు. జీవితంలో టైం మేనేజ్‌మెంట్ అత్యంత ప్రధానమని మోడీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తమ తల్లులు ఇంట్లో ఎలా టైం మేనేజ్ చేస్తూ... పనులు నిర్వర్తిస్తారో గమనించాలని విద్యార్థులకు సూచించారు. ఒత్తిడిలో ఉండకండి.. ఒత్తిడిలో ఆలోచించకండి.. ముందు విశ్లేషించండి, పని చేయండి.. మీరు ఆశించిన దాన్ని సాధించేవరకు మీ వంతు కృషి చేయండని మోడీ సూచించారు. ఇక పరీక్షల్లో కాపీ కొట్టడంపైనా ప్రధాని మోడీ మాట్లాడారు. కాపీ చేస్తే ఒక్కసారి, లేదా రెండు సార్లు పరీక్షలో నెగ్గొచ్చు, కానీ జీవితాన్ని నెగ్గలేరని చెప్పారు. షార్ట్‌కట్‌ను ఎప్పుడూ తీసుకోవద్దని, విద్యార్థులు కష్టపడి జీవితంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఒత్తిడిని మోడీ క్రికెట్ తో పోల్చారు. క్రికెట్ మైదానంలో ఉన్న బ్యాటర్ .. ఆడియెన్స్ అరుపులను పట్టించుకోకుండా అతనికి ఎదురుగా వస్తున్న బంతిపైన్ ఫోకస్ చేస్తాడన్నారు. అదే విధంగా విద్యార్థులు కూడా ఒత్తిడిని పక్కనబెట్టి, చదువుపై దృష్టి సారించాలని చెప్పారు.

# కొనసాగుతున్న డెక్కన్ మాల్ కూల్చివేత పనులు



(మొదటి పేజీ తరువాయి) అయితే ఎస్ కే మల్లు వద్ద సరైన మిషినరీ లేదని ఒప్పందం కాన్సెల్ చేశామన్నారు. రెహ్మాన్ మాలిక్ ట్రేడింగ్ / డెమోలిషన్ కంపెనీకి మాల్ కూల్చివేతే పనులు అప్పగించామని ఆయన స్పష్టం చేశారు. మాలిక్ సంస్థ వద్ద సరైన మిషనరీ ఉందన్నారు. భవనం లోపలే కూల్చేవిధంగా డిమాలిషన్ జరుగుతుందని చెప్పారు. బిల్డింగ్ వ్యర్థాల తొలగింపు మాత్రం ఓనర్ దే బాధ్యత అని అన్నారు. భవనం కూల్చివేత సేఫ్ గా జరిగేవిధంగా చూసుకోవడమే తమ బాధ్యత అని వెల్లడించారు. నాలుగు రోజుల్లో భవనం కూల్చివేత పక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉందని జియఉద్దీన్ పేర్కొన్నారు. గురువరాం రాత్రి 11 గంటలకు బిల్డింగ్ కూల్చివేత పనులు ప్రారంభించారు. భారీ క్రేన్ సాయంతో కూల్చివేత పనులను చేపట్టారు. బిల్డింగ్ ముందు భాగం నుండి ఒక్కొక్క ఫ్లోర్ గోడ కూల్చివేత పక్రియను మొదలుపెట్టారు. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ.. పక్క బిల్డింగులకు ఎలాంటి డ్యామేజ్ కాకుండా పనులు చేపట్టారు. పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. బిల్డింగ్ కూల్చివేత సమయంలో గోడల నుండి పొగలు రావడంతో పనులు కొంతసేపు నిలిచిపోయాయి. తరువాత కూల్చివేత పనులను మళ్లీ మొదలు పెట్టారు. బిల్డింగ్ ను కూల్చివేస్తున్న సందర్భంగా దాదాపు 5 రోజుల పాటు రెండు వైపుల రోడ్డును మూసివేశారు. డెక్కన్ మాల్ బిల్డింగ్ పరిసర ప్రాంతంలోకి ఎవరూ రాకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

# లోకేశ్ పాదయాత్ర ప్రారంభంలోనే అపశృతి



(మొదటి పేజీ తరువాయి) మెరుగైన వైద్యం అందించాలని కోరారు. టీడీపీ నేత లోకేష్ పాదయాత్రలో తీవ్ర అస్వస్థతకు గురైన సినీ నటుడు తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. తారకరత్నకు వైద్యం అందిస్తున్న కుప్పం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. ఆసుపత్రి వద్ద ఉన్న బాలకృష్ణతో పాటు, పార్టీ నేతలతో కూడా చంద్రబాబు మాట్లాడారు. కాగా.. లోకేష్ యువగళం పాదయాత్రలో పాల్గొన్న తారకరత్న సొమ్మసిల్లి పడిపోయారు. పాదయాత్ర ప్రారంభమయ్యాక కుప్పం సమీపంలోని ఓ మసీదులో లోకేష్ ప్రార్థన నిర్వహించగా తారకరత్న కూడా పాల్గొన్నారు. లోకేష్ మసీదు నుంచి బయటకు రాగానే ఒక్కసారిగా టీడీపీ కార్యకర్తలు తరలిరావడంతో వారి తాకిడికి తట్టుకోలేక తారకరత్న సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే ఆయన్ను కుప్పంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే తారకరత్న గుండెపోటుకు గురైనట్లు వైద్యులు తెలిపారు. వెంటనే ఆయనకు యాంజియోగ్రామ్ చేశారు. ప్రస్తుతం తారకరత్నకు ప్రాణాపాయం లేదని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేశాయి.


# ఒడిషా నేతలను స్వాగతించిన కెసిఆర్



(మొదటి పేజీ తరువాయి) అంతా సముద్రంలో కలుస్తున్నది. మహానదితో పాటు బ్రాహ్మణి, వైతరణి నదులు కూడా ప్రవహిస్తున్నాయి. కానీ తాగడానికి నీరు లేదు. ఈ నీరంతా ఎక్కడికి పోతున్నది ? ఈ నీళ్ళు తాగునీటిగా మన ఇండ్లలోకి నల్లాల ద్వారా ఎందుకు రావడం లేదన్నారు. ఈ 75 సంవత్సరాలుగా మీరు భారీ ప్రసంగాలు ఇచ్చారు కానీ తాగడానికి నీరు ఇవ్వలేదు. తాగడానికి నీరు ఉండదు. కరెంటు ఉండదు. కానీ ప్రసంగాలు మాత్రం ఘనం. కోట్లమంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం తిరుగుతున్నారు. రైతులు వారి హక్కుల కోసం దేశరాజధాని ఢిల్లీలో 13 నెలల పాటు ఆందోళన చేపట్టాల్సిన దుస్థితి. భారతదేశంలో తప్ప వేరే ఏ దేశంలోనైనా ఇలా జరుగుతుందా ? 13 నెలల పాటు రైతుల ఆందోళన సాగడం సిగ్గు పడాల్సిన విషయం. అంత సుదీర్ఘ కాలం రైతుల ఆందోళన చేపట్టిన ఫలితం శూన్యం. కేంద్రం నుంచి సమాధానమే రాలేదు. ఒక్క సమస్యకు పరిష్కారం లభించలేదు. నేటి వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్క భరోసా కూడా లభించలేదన్నారు. 75 సంవత్సరాల తర్వాత కూడా ప్రజలకు త్రాగడానికి తగినన్ని నీళ్ళు లేవు. వ్యవసాయరంగానికి, రైతులకు చాలినంత సాగునీటిని కూడా అందించలేకపోతున్నారు. విద్యుత్ సౌకర్యాన్ని కూడా కల్పించలేకపోతున్నారు. ఇవేం దుర్భర పరిస్థితులని కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ప్రభుత్వాలను చూసినం. ఎందరో నాయకులను చూసినం. ఎన్నో రంగు రంగుల జెండాలను చూసినం. కానీ రైతులు, పేదల పరిస్థితి మాత్రమ మారలేదు. దీనికి కారణం ఏమిటన్నది ఆలోచించాలన్నారు. ఎన్నికల్లో పార్టీలు గెలుస్తున్నాయి. నాయకులు గెలుస్తున్నారు. కానీ ఎన్నికల తర్వాత ప్రజలు ఓడిపోతున్నారు. భారతదేశ రాజకీయాల్లో గంభీరమైన మార్పులు రావాల్సి ఉంది. ఎన్నికల్లో పార్టీలు, నాయకులు కాదు ప్రజలు గెలవాలన్నారు. ఎన్నికల తర్వాత ప్రజలు గెలవాలి. అదే ప్రజాస్వామ్యం గెలుపు. దాని పేరు అసలైన ప్రజాస్వామ్యం. రాజకీయ కుట్రదారులు అధికారమే పరమావధిగా ఎన్నో నినాదాలిచ్చారు. ఎన్నో హామీలిచ్చారు. తర్వాత ఏం జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. నేడు మన భారతదేశ లక్ష్యం ఏమిటి ? మన దేశం లక్ష్యం కోల్పోయింది. దారి తప్పింది. ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా పరిణమించింది. ఏం చేసైనా ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జాతి పేరు మీద, మతం పేరు మీద ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారు. ప్రజలను విభజిస్తున్నారని అన్నారు. ప్రజా సేవ, దేశాభివృద్ధే లక్ష్యంగా పార్టీలు రావాలి. ఎన్నికల్లో గెలుపు అందుకున్న పార్టీలు ఆ దిశగా పాటుపడాల్సి ఉందన్నారు. గిరిధర్ గమాంగ్ గారు మాజీ సీఎం. చాలా గొప్ప సీనియర్ నాయకుడు. మచ్చలేని నాయకుడు. వారు ఈ పార్టీలో చేరడం చాలా ఆనందంగా ఉంది. ఒడిషా నుంచి మీరందరూ రావడం నాకు వేయి ఏనుగుల బలాన్ని ఇస్తున్నది. మా ఒడిషాలో 500 రూపాయల పెన్షన్ మాత్రమే ఇస్తున్నారు... తెలంగాణలో 2000 రూపాయల పెన్షన్ ఇస్తున్న విషయాన్ని చెప్పమని సీఎం కేసీఆర్ ను ఒడిషా నాయకుడు కోరగా చప్పట్లు మారుమోగాయి. బిఆర్ఎస్ కు అధికారం ఇస్తే రెండేండ్లలో దేశమంతటికీ 24 గంటల నాణ్యమైన విద్యుత్ ను అందిస్తాం. వ్యవసాయానికి ఉచిత్ విద్యుత్ ఇస్తాం. దేశంలోని రైతులకు కిసాన్ బంధు, ఏటా 20 లక్షల దళిత కుటుంబాలకు దళితబంధును అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రావణ్, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ వేణుగోపాలాచారి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# తెలుగు చలనచిత్రరంగంలో మరో విషాదం



(మొదటి పేజీ తరువాయి) నాటకంలో పాత్రకోసం జమునను ఎంపిక చేశారు. అనంతరం ఆమె అడుగులు సినిమావైపు పడ్డారు. 14 ఏండ్ల వయస్సులోనే సినిమాల్లోకి ప్రవేశించారు. 1953లో నటించిన పుట్టిల్లు ఆమె తొలిచిత్రం.అయితే 'అంతా మనవాళ్లే' సినిమాతో ఆమె కెరీర్ మలుపు తిరిగింది. నిరుపేదలు, మా గోపీ, బంగారుపాప సినిమాలు ఆమెకు మంచిపేరు తీసుకొచ్చాయి. మిస్సమ్మ సినిమాలో ఆమె నటన అందరినీ ఆకట్టుకున్నది. రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, జగ్గయ్య వంటి అలనాటి అగ్రహీరోల సరసన నాయికగా నటించినప్పటికీ.. ఆమెకు బాగా పేరు తెచ్చింది మాత్రం సత్యభామ క్యారెక్టరే. ఆ పాత్రలో ఆమెను తప్ప ఇంకెవరినీ ఊహించుకోలేమన్నట్టుగా జీవించిపోయారు. శ్రీకృష్ణ తులాభారం సినిమాలో సత్యభామ పాత్ర జమునకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది. గుండమ్మకథ, మిస్సమ్మ, మూగమనసులు ఆమెకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 198 సినిమాల్లో ఆమె నటించారు. ఇందులో తెలుగులో 145 సినిమాలు ఉండగా, తమిళం 20, కన్నడం 7, హిందీలో 10 చిత్రాల చొప్పున ఉన్నాయి. 1959 నుంచి సావిత్రితోపాటే స్వర్ణయుంగం చూసిన జమున.. తెనాలి రామకృష్ణ, భాగ్యరేఖ, భూకైలాస్, దొంగల్లో దొర, ఇలవేల్పు, ఇల్లరికం, ముద్దుబిడ్డ, చిరంజీవులు, మిస్సమ్మ, మూగమనసులు, శ్రీకృష్ణ తులాభారం, రాముడు-భీముడు, తోడు-నీడ, రాము, లేతమనసులు, పూలరంగడు, ఉండమ్మా బొట్టు పెడతా, గులేబకావళి కథ, బొబ్బిలియుద్ధం, మంచి మనిషి సినిమాల్లో ఆమెకు మంచి పేరువచ్చింది. 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 1968లో మరోసారి ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు. మిలాన్ చిత్రంలో గౌరీ పాత్రకు బాలీవుడ్ ఫిల్మ్‌ఫేర్ లభించింది. 2008లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చిన తొలితరం నాయిక జమున కావడం విశేషం. భర్త, పిల్లల కోసం ఆమె తన మకాంను హైదరాబాద్ బంజారాహిల్స్‌కు మార్చారు. ఇక్కడి వచ్చినతర్వాత ఆమెకు రాజకీయాలతో పరిచయం ఏర్పడింది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆహ్వానంతో 1980లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1985లో మంగళగిరి నుంచి పోటీచేసి ఓడిపోయారు. అనంతరం 1989లో రాజమండ్రి నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు. 1991 ఎన్నికల్లో రాజమండ్రి నుంచి పోటీచేయగా ఓటమిచవిచూశారు. రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా పనిచేశారు. అప్పటి నుంచి ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

# షర్మిల పాదయాత్రకు కండిషన్స్

## షరతులతో వరంగల్ పోలీసుల అనుమతి

**వరంగల్, జనవరి 27 (సమ సమాజం):** వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల పాదయాత్రకు పోలీసులు కండీషన్లతో కూడిన అనుమతినిచ్చారు. 14 కండిషన్లతో అనుమతి ఇచ్చారు. ఎక్కడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. చెన్నారావుపేట మండలం లింగగిరి వద్ద గత ఎడాది నవంబర్ 28న షర్మిల అరెస్ట్‌తో పాదయాత్ర నిలిచిన విషయం తెలిసిందే. ఈనెల 25న తిరిగి పాదయాత్ర నిర్వహించుకోవాడనికి సీపీకి వైఎస్ఆర్టీపీ నేతలు దరాఖాస్తు చేశారు. అయితే వచ్చే నెల 2 నుంచి 18 వరకూ పాదయాత్ర నిర్వహించుకోవడానికి సీపీ రంగనాథ్ అనుమంతించారు. ఉదయం నుంచి 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే పాదయాత్రకు అనుమతినిచ్చారు. పార్టీలు, కులాలు, మతాలు, వ్యక్తిగతంగా ఉద్దేశించి వివాస్పదవాఖ్యలు చేయవద్దని కండీషన్లు పెట్టారు. ర్యాలీల్లో ÷ర్ క్రాకర్స్ ఉపయోగించవద్దని, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల విధులకు ఆటంకం కలిగించవద్దంటూ అనేక నిబంధనలతో పాదయాత్రకు అనుమతినిచ్చారు. లింగగిరి గ్రామం నుంచి నెక్కొండ, పర్వతగిరి, వర్ధన్నపేట, వరంగల్, హనుమకొండ, కాజీపేట ఘన్ పూర్ , జఫర్ గడ్, ఘన్ పూర్, నర్మెట్ట, జనగామ, దేవుర్పుల , పాలకుర్తి మండలం దరిదేపల్లి వరకు షర్మిల పాదయాత్రకు అనుమతి లభించింది.



# సానియా మీర్జా జోడీ ఓటమి

బ్రెజిలియన్ జోడీపై ఫైనల్‌లో పరాజయం

మెల్‌బోర్న్,జనవరి27(సమసమాజం): సానియా మీర్జా, రోహన్ బోపన్న జోడీ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్ లో బిగ్ షాక్ తగిలింది. బ్రెజిలియన్ జోడీ లూయిసా స్టెఫానీ, రాఫెల్ మాటోస్ చేతిలో సానియా-బోపన్న జోడీ ఘోరమైన ఓటమి చవిచూసింది. గ్రాండ్ స్లామ్ కెరీర్ లో తన చివరి మ్యాచ్‌ని సానియా మీర్జా ఓటమితో ముగించింది. శుక్రవారం రాడ్ లావర్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో భారత జోడీ 6-7 (2-6), 2-6తో ఓటమిని మూటగట్టుకున్నారు. తొలి సెట్‌లో 2-2, 3-2 ఆధిక్యంలోకి వెళ్లినా.. తర్వాత 0-2తో వెనుకబడిన బోపన్న, సానియా మళ్లీ పోటీలోకి వచ్చినా.. బ్రెజిలియన్లు మాత్రం మ్యాచ్ పై పట్టును అస్సలు వదల్లేదు.భారత ద్వయం త్వరగా 4-3 ఆధిక్యంతో ఊపందుకునే ముందు 3-3తో దానిని పూర్తి చేశారు. బోపన్న-మీర్జా ఆధిక్యాన్ని 5-3కి పెంచడానికి రెండవ సర్వీస్ బ్రేక్‌ను తీసుకున్నారు. అయితే.. బ్రెజిలియన్లు మ్యచ్‌ను అంత తేలికగా తీసుకోలేదు. విరామం తర్వాత పుంజుకుని 5-5తో సమం చేశారు. భారత్‌కు 6-5 ఆధిక్యాన్ని అందించిన సెట్‌లో సానియా మూడోసారి సర్వీస్‌ను నిలబెట్టుకుంది. బోపన్న సర్వీస్ ఆందోళన కలిగించింది. భారత్‌కు మొదటి పాయింట్లు అందించడానికి ముందు భారత్ 0-3తో వెనుకబడింది. అయితే, బ్రెజిల్ తొలి సెట్‌ను 7-6 (6-2)తో చేజార్చుకుంది. అయితే.. సెకండ్ సెట్ పూర్తిగా ఏకపక్షంగా సాగడంతో. బ్రెజిల్ 3-1తో ఆధిక్యంలోకి వెళ్లి సర్వ్ బ్రేక్ చేసింది. దీంతో సానియా-బోపన్న జోడీకి ఓటమితో ఇంటి ముఖం పట్టారు. ఇక సానియా మీర్జా ఈ మ్యాచ్ ఓటమితో టెన్నిస్ కెరీర్ కు వీడ్కోలు పలికినట్లయింది.

# పోరాడి ఓడిన భారత్



న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ 21 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. వాషింగ్టన్ సుందర్ అద్భుతంగా పోరాడినా ఫలితం దక్కలేదు. బంతితో, బ్యాట్‌తో రాణించిన వాషింగ్టన్ సుందర్ తన ఆటతో (2 వికెట్లు, 50 పరుగులు) ఆకట్టుకోవడం ఈ మ్యాచ్ విశేషం. 30 బంతుల్లో 59 పరుగులు చేసి న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించిన డారెల్ మిచెల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన ఉత్సాహంతో ఉన్న టీమిండియా తొలి టీ20లో బోల్తా పడింది. సూర్యకుమార్ యాదవ్, వాషింగ్టన్ సుందర్ మినహా ఏ ఒక్కరూ చెప్పుకోదగిన విధంగా ఆడలేకపోయారు. అటు బౌలర్లు కూడా భారీగా పరుగులు సమర్పించుకున్నారు. దీంతో కివీస్ చేతిలో భారత జట్టు 21 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 30 బంతుల్లో 59 పరుగులు (3 ఫోర్లు, 5 సిక్స్‌లు) చేసి న్యూజిలాండ్ విజయంలో కీలక పాత్ర పోషించిన డారెల్ మిచెల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆదిలోనే 3 వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఇషాన్ కిషన్ (4 పరుగులు, 5 బంతుల్లో), రాహుల్ త్రిపాఠి (0, 6 బంతుల్లో), శుభ్‌మన్ గిల్ (7 పరుగులు, 6 బంతుల్లో) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. దీంతో భారత్ 3 ఓవర్లలో 15 పరుగులు మాత్రమే చేసి, 3 వికెట్లను కోల్పోయింది.




# సెల్ఫీలో విసిగించిన అభిమాని

## ఫోన్ తీసి విసిరేసిన రణ్‌బీర్



తమకిష్టమైన హీరో హీరోయిన్లు నటీనటులు కనపడితే ఫ్యాన్స్ అత్యుత్సాహం చూపించడం అదే సమయంలో వారి ప్రవర్తన వల్ల సదరు స్టార్స్ విసుగు చెందటం చాలా సందర్భాల్లో చూస్తూనే ఉంటాం. వాటికి సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. దీంతో వారు విమర్శలకు గురౌతుంటారు. అయితే తాజాగా ఇలాంటి సంఘటనే ఒకటి జరిగింది. బాలీవుడ్ చాక్లెట్ బాయ్ రణ్బీర్ కపూర్ ఉన్న క్రేజ్ గురించి తెలిసిందే. ఆయన కనపడితే చాలు ఫ్యాన్స్ ఆయన్ను చుట్టుముడుతుంటారు. అయితే తాజాగా ఆయన ఒక అభిమాని ప్రవర్తన కారణంగా విసుగు చెందారు. అతని మొబైల్ ఫోన్ను లాక్కొని విసిరేశారు. ఓ పబ్లిక్ ప్లేస్‌లో రణ్‌బీర్ ఉండగా.. ఆయనతో కలిసి సెల్ఫీ దిగేందుకు ఓ అభిమాని ప్రయత్నించాడు. అయితే మొదట బాగానే ఫోటోలు దిగిన రణ్బీర్ ఆ తర్వాత సహనం కోల్పోయాడు. ఎందుకంటే సదరు ఫ్యాన్స్.. ఫొటో దిగే సమయంలో ఆ పిక్ సరిగ్గా వచ్చినట్టు లేదు. దీంతో అతడు రణ్బీర్ను వెళ్లనివ్వకుండా మళ్లీ సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే సహనం కోల్పోయిన రణ్బీర్.. ఆ వ్యక్తి నుంచి ఫోన్ లాక్కొని విసిరేశాడు. ఈ దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో అది కాంట్రవర్సీగా మారింది. కొంతమంది నెటిజన్లు రణ్బీర్ ప్రవర్తనను తప్పుబడుతున్నారు. అలా చేయడం సరికాదని అంటున్నారు. కాగా రణ్బీర్ తన భార్యతో కలిసి నటించిన 'బ్రహ్మాస్త్రం'తో సూపర్ హిట్టు అందుకున్నారు. ప్రస్తుతం రెండో పార్ట్ కోసం సిద్ధమవుతున్నారు. అలాగే ఇటీవలే ఆయన హీరోయిన్ శ్రద్దా కపూర్తో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ తూ ఝూటీ.. మై మక్కార్ ట్రైలర్ విడుదలైంది. దర్శకుడు లవ్ రంజన్ తెరకెకిస్తోన్న ఈ సినిమా హోలీ పండగ సందర్భంగా మార్చి 8న విడుదలవుతోంది. ఆకట్టుకునే దృశ్యాలు హీరోహీరోయిన్ల మధ్య సరదాగా నడిచే రొమాన్స్ నవ్వు తెప్పించే సంభాషణలతో ట్రైలర్ కళ్లకు ఇంపుగా ఉంది.

# పాత్రలో పరకాయ ప్రవేశం చేసే జమున



సత్యభాగా ఆమె తప్ప మరెవరూ మెప్పించలేదుం

సావిత్రితో ముందునుంచే పరిచయం

అందుకే జమున అక్కా అని పిలిచేది

తెలుగింటి సత్యభామగా గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటి జమున (86) ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. ఆమె ఏ పాత్ర వేసినా అందులో ఇమిడి పోయేవారు. 'అంతా మనవాళ్లే' సినిమాతో ఆమె కెరీర్ మలుపుతిరిగింది. నిరుపేదలు, మా గోపీ, బంగారుపాప సినిమాలు ఆమెకు మంచిపేరు తీసుకొచ్చాయి. మిస్సమ్మ సినిమాలో ఆమె నటన అందరినీ ఆకట్టుకున్నది. అలాగే గుండమ్మ కథ,శ్రీకృష్ణ తులాభారం, మంగమ్మ శపథం, కలెక్టర్ జానకి వంటి సినిమాల్లో అద్భుత నటనను ప్రదర్శించారు. పాత్రలో పరకాయప్రవేశం చేసి నటించేవారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, జగ్గయ్య వంటి అలనాటి అగ్రహీరోల సరసన నాయికగా నటించినప్పటికీ.. ఆమెకు బాగా పేరు తెచ్చింది మాత్రం సత్యభామ క్యారెక్టరే. ఆ పాత్రలో ఆమెను తప్ప ఇంకెవరినీ ఊహించుకోలేమన్నట్టుగా జీవించిపోయారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 198 సినిమాల్లో ఆమె నటించారు. ఇందులో తెలుగులో 145 సినిమాలు ఉండగా, తమిళం 20, కన్నడం 7, హిందీలో 10 చిత్రాల చొప్పున ఉన్నాయి. 1959 నుంచి సావిత్రితోపాటే స్వర్ణయుంగం చూసిన జమున.. తెనాలి రామకృష్ణ, భాగ్యరేఖ, భూకైలాస్, దొంగల్లో దొర, ఇలవేల్పు, ఇల్లరికం, ముద్దుబిడ్డ, చిరంజీవులు, మిస్సమ్మ, మూగమనసులు, శ్రీకృష్ణ తులాభారం, రాముడు-భీముడు, తోడు-నీడ, రాము, లేతమనసులు, పూలరంగడు, ఉండమ్మా బొట్టు పెడతా, గులేబకావళి కథ, బొబ్బిలియుద్ధం, మంచి మనిషి సినిమాల్లో ఆమెకు మంచి పేరువచ్చింది. 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 1968లో మరోసారి ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు. మిలాన్ చిత్రంలో గౌరీ పాత్రకు బాలీవుడ్ ఫిల్మ్‌ఫేర్ లభించింది. 2008లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు.



# వీరసింహారెడ్డి కలెక్షన్లు స్లో

క్రమంగా తగ్గుతున్న వసూళ్లు

నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన తాజా సినిమా వీర సింహారెడ్డి బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టించింది. సంక్రాంతి పండుగకు రిలీజైన ఈ సినిమాను మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని తెరకెక్కించారు. అఖండ సినిమాతో భారీ సక్సెస్ సాధించిన ఆయన అదే ఊపులో వీర సింహారెడ్డితో కూడా హిట్ కొట్టారు. సినిమా విడుదలైన మొదటి వారం భారీ వసూళ్లను సాధించిన ఈ చిత్రం... రెండో వారం కాస్త డల్ అయింది. ముఖ్యంగా జనవరి 26వ తేదీ(హోలీ డే) రోజు కూడా పెద్దగా సినిమా ఆడకపోవడం.. బాలయ్య అభిమానుల్లో కాస్త నిరాశ కల్గించింది. మొదటివారం కంటే రెండో వారంలో భారీగానే వసూళ్లు తగ్గిపోగా.. 26వ తేదీ రోజు పెరుగుతాయని అందరూ భావించారు. హోలీ డే కావడం వల్ల సినిమాను ఎక్కువ మంది చూస్తారేమో అనుకున్నారు. కానీ ఆరోజు కూడా వసూళ్లు ఎక్కువగా పెరగలేకపోయాయి. మొత్తం పదిహేను రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి వీర సింహారెడ్డి 65.16 కోట్ల బిజినెస్ చేసింది. కర్ణాటకతో పాటు దేశంలోని మిగతా ప్రాంతాల్లో 4.78 కోట్ల రూపాయల వసూళ్లను సాధించింది. ఓవర్సీస్ లో 5.78 కోట్లు రాబట్టగా... ప్రపంచ వ్యాప్తంగా రూ.75.68 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. కానీ 15వ రోజు మాత్రం కేవలం రూ. 26 లక్షల వసూళ్లను మాత్రమే రాబట్టుకోగల్గింది. 15 రోజుల్లో ఈ సినిమా నైజాంలో రూ.16.80 కోట్లు సీడెడ్ లో రూ.16.25 కోట్లు ఉత్తరాంధ్రలో రూ.8.51 కోట్లు తూర్పు గోదావరిలో రూ.5.53 కోట్లు పశ్చిమ గోదావరిలో రూ..15 కోట్లు గుంటూరులో రూ.6.32 కోట్లు కృష్ణాలో రూ.4.66 కోట్లు నెల్లూరులో రూ.2.94 కోట్లతో కలిపి రూ.. 65.16 కోట్ల షేర్ రూ. 105.50 కోట్లు గ్రాస్ వసూలు అయింది. బాలయ్య బాబు గోపీచంద్ కలయికలో వచ్చిన వీర సింహారెడ్డి సినిమా అంచనాలకు అనుగుణంగానే ప్రపంచ వ్యాప్తంగా రూ.73 కోట్ల మేర బిజినెస్ జరిగినట్లు ట్రేడ్ వర్గాలు ప్రకటించాయి. దీంతో బ్రేక్ ఈవెన్ టార్గెట్ రూ.74 కోట్లుగా నమోదు అయింది. ఇక 15 రోజుల్లో ఇందుకు మొత్తంగా 75.68 కోట్లు వచ్చాయి. అంటే ఈ చిత్రానికి హిట్ స్టేటస్ తో పాటు రూ. 1.60 కోట్ల లాభాలు కూడా వచ్చాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in